**పోతన మహాకవి భాగవతము నుండి**

1. ఘన యమునా నదీ కల్లోల ఘోషంబు
   సరస మృదంగ ఘోషంబు గాగ
   సాధు బృందావన చరచంచరీక గా
   నంబు గాయక సుగానంబు గాగ
   గలహంస సారస కమనీయ మంజు శ
   బ్దంబులు తాళ శబ్దములు గాగ
   దివినుండి వీక్షించు దివిజ గంధర్వాది
   జనులు సభాసీన జనులు గాగ

   బద్మరాగాది రత్న ప్రభాసమాన
   మహిత కాళియ ఫణిఫణా మంటపమున
   నళినలోచన విఖ్యాత నర్తకుండు
   నిత్య నైపుణ్యమున బేర్చి నృత్యమాడె.

శ్రీ శేషప్ప కవి – నరసింహ శతకము

2. పసరంబు పంజైన బసుల కాపరి తప్పు
   ప్రజలు దుర్జనులైన బ్రభుని తప్పు
   భార్య గయ్యాళైన బ్రాణ నాధుని తప్పు
   తనయుడు దుడుకైన దండ్రి తప్పు
   సైన్యంబు చెదిరిన సైన్య నాధుని తప్పు
   కూతురు చెడుగైన మాత తప్పు
   అశ్వంబు దురుసైన నారోహకుని తప్పు
   దంతి మదించ మావంతు తప్పు

   ఇట్టి తప్పు లెరుంగక ఇచ్చవచ్చి
   నటుల మెలగుదురిప్పుడీ యవనిజనులు
   భూషణ వికాస ! శ్రీ ధర్మపుర నివాస!
   దుష్ట సంహార! నరసింహ! దురిత దూర!

3. తల్లి గర్భమునుండి ధనముదేడెవ్వడు

వెళ్ళిపోయెడి నాడు వెంట రాదు

లక్షాధికారైన లవణమన్నమె కాని

మెరుగు బంగారంబు మ్రింగబోడు

విత్త మార్జన చేసి విర్ర వీగుటె కాని

కూడ బెట్టిన సొమ్ము గుడువబోడు

పొందుగా మఱుగైన భూమి లోపల బెట్టి

దాన ధర్మములేక దాచి దాచి

తుదకు దొంగలకిత్తురో ? దొరలకవునొ ?

తేనె జుంటీగ లియ్యవా తెరువరులకు

భూషణ వికాస! శ్రీ ధర్మపుర నివాస!

దుష్ట సంహార! నరసింహ ! దురిత దూర !

**శ్రీ కాసుల పురుషోత్తమ కవి – ఆంధ్ర నాయక శతకము**

4. రాజ కార్య పరుండు తేజోబలాధికు

డాంజనేయుడు భృత్యుడగుట జేసి

యమిత శౌర్యుడు ప్లవంగమ కులేశు డినజు

డలిలేని స్నేహితుడగుట జేసి

విమత మర్మజ్ఞుండు విశ్వాస భరితాత్ము

డల విభీషణు డాప్తుడగుట జేసి

సుమనస్కుల మనస్కులమృత వాక్యంబుల

బొసగ నాశీర్వదించుటను జేసి

లంక సాధించితివి గాని లావు చేత

నిర్జరారుల గెలువంగ నీ తరంబె ?

చిత్ర చిత్ర ప్రభావ ! దాక్షిణ్య భావ!

హత విమత జీవ ! శ్రీ కాకుళాంధ్రదేవ!

**శ్రీ గోగులపాటి కూర్మనాథ కవి – సింహాద్రి నారసింహ శతకము**

5. కాంతల జెరబట్ట గనుగొనుచుంటివి
    పాంచాలి వెతయెట్లు బాపినావొ
గోవధసేయ గన్గొను చుంటివిప్పుడు
    కరుణతో గరినెట్లు కాచినావొ
ద్విజులు బాధలు పడ తిలకించు చుంటివి
    భువి గుచేలుని నెట్లు ప్రోచినావొ
'సత్ప్రభు' రాజ్య నాశన మందగంటివి
    ధ్రువుని కెట్లిచ్చితో దొడ్డపదవి

దుష్ట శిక్షణ మొనరించి శిష్ట రక్ష
చేయకుండిన పూర్వ ప్రసిద్ధి చెడును
ఆర్త రక్షణ బిరుదంబు హాని జెందు
వైరి హర రంహ ! సింహాద్రి నారసింహ !

**శ్రీ గుఱ్ఱం జాషువా – పిరదౌసి**

6. విత్తనంబున మహా వృక్షంబు నిమిడించి
    సృష్టించి గారడీ సేయువాడ !
కడుపులో శిశువును గల్పించి పదినెలల్
    మోయించి యూపిరి వోయువాడ!
సద్భక్త వరులకు సాక్షాత్కరించియు
    నున్నచోటెరిగింపకున్న వాడ!
పొటమరింపక ముందె పుష్ప సంతతులకు
    వింతగా రంగులు వేయువాడ!

చెలువ మొప్పు బుడమి సృష్టించి మాకిచ్చి
అనుభవింపు డనుచు నానతిచ్చి
నిలువ నీడ లేక నిల్చిన కలవాడ!
కడుపు నిండ నన్ను గన్న వాడ!

**శ్రీ గుఱ్ఱం జాషువా - ముంతాజు మహలు**

7. ఏ వన్నెగల తీవె కే పచ్చ సవరింప
        జెలు వారునో దాని చిలికి జేసి
    ఏ పుష్ప దళమున కే పుష్య రాగంబు
        సరిపోవునో దాని సంఘటించి
    ఏ కిసాలంబున కే కెంపు జోడింప
        కొమరారునో దాని కూర్పు జేసి
    ఏ గులాబీ మొగ్గ కే రవ్వ బొదిగింప
        నందగించునొ దాని నతుకు పెట్టి

    ప్రకృతి సిద్ధమైన వన్నెతో వన్నెకు
    చెలిమి గలిపి భావముల నిమిడ్చి
    చలువరాతి ఫలకములు దీర్ప సాగిరి
    చిత్ర చిత్ర గతుల శిల్పివరులు

**శ్రీ గుఱ్ఱం జాషువా - కాందిశీకుడు**

8. ఘన వివేకానంద ముని యమేరిక సీమ
        సన్నుతింపగ జయ స్తంభ మెత్తె
    అరుణాచలము మీద నరుణ తేజశ్శాలి
        రమణర్షి శత్రు షట్కమునణంచె
    అరవిందముని నిరంతర సమాధిన్నిల్చి
        లోక త్రయంబు వశీకరించె
    మూడు గాళుల దొడ్డ ముసలి కోమటి శెట్టి
        స్వేచ్ఛా వికుంఠంబు బేరమాడె

    నాల్గు ఖండములకు నవనవోజ్జ్వలములౌ
    ధర్మ మార్గములకు దారిసూపి
    ఘనత నాచికొన్న ఖండంబు మనదన్న
    పౌరుషంబు మనది ప్రజ్ఞ మనది

**కరుణ శ్రీ జంధ్యాల పాపయ్య శాస్త్రి**

9. ఆ ప్రక్క చూసినావా! మండుటెండలో
   పొలము దున్నెడు కృషీవలులు వారు
   ఆ వైపు గాంచినావా! పొట్ట కూటికై
   మేనమ్ముకొన్న కార్మికులు వీరు
   ఆ దిక్కు కనుగొంటివా! వట్టి జోలెతో
   కుమిలి కృశించు బిక్షుకులు వారు
   ఆ మూల అరసినావా! గంజిలేక య
   ల్లాడు దరిద్ర బాలకులు వీరు

   కష్ట నిష్ఠురమోయి ఈ సృష్టి యెల్ల
   శోక విహ్వల మోయి ఈ లోకమెల్ల
   వేదనా పూర్ణమైన ఈ విశ్వమందు
   శాంతి ఎచ్చట ? ఎచట విశ్రాంతి నీకు ?

**శ్రీ దువ్వూరి రామిరెడ్డి – జలదాంగన**

10. గగన స్రవంతికా కల్లోల డిండీర
    ఖండంబు లభ్రమ్ము గప్పెననగ
    నందన కల్పద్రు సందోహములు పూచి
    ఎల్లెడ బుప్పొడి చల్లెననగ
    ప్రాగద్రి శిఖర ఘర్షణమునందొలివడి
    యుడుభర్త యమృతంబు నొలికెననగ
    దిఙ్మత్త కరిదంత దీప్తులాకాశ ద
    ర్పణమున బింబించి వఱలెననగ

    శర్వరీ మందిరాంత స్తంబులైన
    హీరమణి దీపముల కాంతి సారమనగ
    మెత్తదనమును శైత్యమ్ము మిళితమైన
    పండు వెన్నెల నల్గడ నిండు కొనియె

**శ్రీ అల్లసాని పెద్దన**

11. చిన్ని వెన్నెలకందు వెన్నుదన్ని సుధాబ్ధి
బొడమిన చెలువ తోబుట్టు మాకు
రహివుట్ట జంత్ర గాత్రముల రాల్గరగించు
విమల గాంధర్వంబు విద్య మాకు
ననవిల్తు శాస్త్రంపు మినుకులావర్తించు
పని వెన్నతోడ బెట్టినది మాకు
హయమేధ రాజసూయములన బేర్పడ్డ
సవన తంత్రంబులుంకువలు మాకు

గనక నగసీమ, గల్ప వృక్షముల నీడ
బచ్చరాచట్టుగమి రచ్చపట్టు మాకు
బద్మ సంభవ వైకుంఠ భర్గ సభలు
సాము గరిడీలు మాకు గోత్రామరేంద్ర !

**శ్రీ తుమ్మల సీతా రామ మూర్తి చౌదరి**

12. కొసరి నూరిన పచ్చిపసపుబూత మొగాన
గుమ్మడి పూ దుమారమ్మునద్ది
కండరేగడ నారబండి కన్పండుపై
వొలుచు మిర్యపు బండు బొట్టు పెట్టి
వలిపెమ్మునకు నొక్కవాసి హెచ్చయినట్టి
నునుమంచు తెరచీర నూలుకొల్పి
బంతి పూవులకు, జేమంతి నెయ్యము గూర్చి
కబరీభరమ్ము చక్కన కుదిర్చి

పంట కళ్ళాలు మును బరాబరులు సేయ
గూడు కట్టిన తెలిమబ్బు గొడుగునీడ
కదలి వచ్చెను భాగ్యాల కడలి వోలె
మకర సంక్రాంతి లక్ష్మి హేమంత వీధి

13. లేగటి పాలలోగ్రాగి మాగిన తీయ

తీయ కప్పుర భోగి పాయసంబు

చవులూరు కరివేప చివురాకుతో గమ

గమలాడు పైర వంకాయ కూర

తరుణ కుస్తుంబరీ దళమైత్రిమై నాల్క

త్రుప్పు డుల్చెడు నక్క దోస బజ్జి

క్రొత్త బెల్లపు దోడికోడలై మరిగిన

మదురు గుమ్మడి పండు ముదురు పులుసు

జిడ్డు దేరిన వెన్నల గడ్డ పెరుగు

గరగరిక జాటు ముంగారు జెఱకు  రసము

సంతరించితి విందు భోజనము సేయ

రండు రండని పిలిచె సంక్రాంతి లక్ష్మి

**శ్రీ దేవులపల్లి కృష్ణ శాస్త్రి**

14. ఎలదేటి చిరుపాట సెలయేటి కెరటాల

బడిపోవు విరికన్నె వలపు వోలె

తీయని మల్లెపూదేనె సోనల పైని

తూగాడు తలిరాకుదోనె వోలె

తొలిప్రొద్దు తెమ్మెర త్రోవలో పయనమై

పరువెత్తు కోయిల పాట వోలె

వెల్లువలై పారు వెలది వెన్నెలలోన

మునిగి పోయిన మబ్బు తునుక వోలె

చిరుత తొలకరి వానగా, చిన్ని సోనగ

పొంగి పొరలెడు కాల్వగా, నింగికెగయు

కడలిగా పిల్ల గ్రోవిని వెడలు వింత

తీయదనముల లీనమైపోయె నెడద.

15. జిలిబిలి పట్టు రేకుల వెన్క తొట్రిలు
మల్లియ యెద దాగు మదుప రవము
కనుచూపు దాటు నామని బాయు కోయిల
గొంతులో చిక్కు వసంత గీతి
విభు వీడి శుష్కించు విరహిణి సెలయేటి
కడుపులో నడగిన కడలి మ్రోత
రేనికై వెదకెడు రిక్కచూపులలోన
చెరవడ్డ నిండు చందురుని పాట

యిట్టు లీ దీన గోపికా హృదయమంది
రాంతరాళము లోన త్రుళ్లింతలాడు
వేణు నాదంబు వినిపించు విశ్వమోహ
నాకృతి కిశోర గాయకు నరయుచుంటి